నిలువెత్తున తవ్వకాలు.. నిర్లిప్తంగా అధికారులు!



కంది మండలం చిద్రుప్పలోని పెద్ద చెరువులో అక్రమార్కులు మట్టి తవ్వకాలు చేపట్టారు. నిలువెత్తునా గుంతలు తవ్వడంతో చెరువు కళ తప్పుతోంది. గుంతల వల్ల ఈతకు, దుస్తులు ఉతికేందుకు, కాలకృత్యాలకు వెళ్లే వారు ప్రమాదాల బారిన పడే అవకాశం ఉంది. చెరువు కట్ట సమీపంలో వ్యవసాయ పొలాల పక్కన కనీసం కంచె నాటించేలా అధికారులు, పంచాయతీ పాలకవర్గం సభ్యులు చొరవ తీసుకోవాలని ఆ గ్రామస్థులు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, సంగారెడ్డి అర్బన్, కంది

ఏడాదిగా విస్తరణ వాహనదారులకు తిప్పలు!



సంగారెడ్డి-నాందేడ్- అకోలా జాతీయ రహదారి విస్తరణలో భాగంగా కంది మండలం చెర్యాల్ శివారులో పనులు చేస్తున్నారు. ఈ మేరకు వాహనదారులు 1.5 కి.మీ.ల దూరం చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తోంది. చెర్యాల్ శివారులో రహదారిపై వర్షాకాలంలో నీరు నిలుస్తోందని ఇంజినీర్లు వంతెన, కాలువల నిర్మాణం, మరమ్మతులు చేపట్టారు. ఏడాది గడిచినా పనులు పూర్తి కాలేదు. వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. **- న్యూస్‌టుడే, సంగారెడ్డి అర్బన్**

నకిలీలని గుర్తించి.. గుట్టుగా ఉంచి...

- సంగారెడ్డిలోని 18 ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఇటీవల వైద్య బృందం తనిఖీలు చేపట్టింది. గడువు ముగిసిన యంత్రాలను వాడుతున్నారని గుర్తించారు. స్కానింగ్ కేంద్రం అనుమతి గడువు ముగియడంతో వెంటనే అదే రోజు స్కానింగ్ కేంద్రాన్ని సీజ్ చేశారు. నిబంధనలు ఉల్లంఘించిన మూడు ప్రైవేట్ ఆస్పత్రులకు తాఖీదులు జారీ చేశారు.
- గుమ్మడిదల, ఇస్నాపూర్‌ల్లో ఆర్‌ఎంపీలు తమ స్థాయికి మించి వైద్యం అందించడంతోపాటు, కార్మికులకు సామర్థ్య పరీక్షల ధ్రువీకరణ పత్రాలు జారీ చేశారు. దీంతో ముగ్గురిపై కేసు నమోదు చేశారు.
- గతేడాది తెలంగాణ వైద్యమండలి సభ్యులు, అయిదు బృందాలుగా ఏర్పడి ప్రైవేట్ ఆస్పత్రులను తనిఖీ చేశారు. సంగారెడ్డి, కొండాపూర్ మండలం మల్కాపూర్, సదాశివపేట, దౌల్తాబాద్, మునిపల్లి మండలం కంకోల్, ఇస్నాపూర్, జహీరాబాద్‌ల్లో తనిఖీలు చేపట్టి 25 మందిని నకిలీ వైద్యులుగా గుర్తించినా, ఇప్పటివరకు వారిపై చర్యలు తీసుకోలేదు.



సంగారెడ్డిలోని ప్రైవేట్ ఆస్పత్రిలో తనిఖీలు చేస్తున్న వైద్యాధికారులు

న్యూస్‌టుడే, సంగారెడ్డి అర్బన్

జిల్లాలో వివిధ రకాల 678 ప్రైవేట్ ఆసుపత్రులకు అనుమతులున్నాయని వైద్యారోగ్యశాఖ అధికారులు పేర్కొంటున్నారు. అనధికారికంగా పల్లెలు, పట్టణాల్లో నకిలీ వైద్యులు క్లినిక్‌లు ఏర్పాటు చేసి చికిత్స చేస్తున్నారు. వీరి వద్దకు వచ్చే వారిని వ్యాధుల పేరుతో పట్టణాల్లోని

● అర్హత లేని వైద్యులపై చర్యలు శూన్యం

ప్రైవేట్ ఆసుపత్రులకు పంపించి కమీషన్ తీసుకుంటున్నారు. వైద్యుడి చీటీ లేకుండా మత్తు ఇంజక్షన్ ఇవ్వడం నిబంధనలకు విరుద్ధం. అయినా కొందరు యువత వీటిని వీటిని వినియోగిస్తున్నారు. ఇప్పటి వరకు ఇవి ఎలా వస్తున్నాయో అని తేల్చలేక పోతున్నారు.

నిబంధనల అమలు అంతంతే

ప్రైవేట్ ఆస్పత్రుల్లో ధరల పట్టిక, వైద్యులు ఎంత మంది? వారికి అర్హత ఉందా? లేదా పరిశీలించాలి. విధుల్లో ఉన్న వైద్యుల పేర్లు బోర్డులో ప్రదర్శించాలి. ప్రసవాలు, ఇతర అన్ని రకాల సేవలు పక్కాగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి. క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్‌ను పక్కాగా అమలు చేయడంలేదు.

టాస్క్‌ఫోర్స్ కమిటీలతో పర్యవేక్షణ పెంచాం :

జిల్లాలో టాస్క్‌ఫోర్స్ కమిటీలను నియమించి ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో తనిఖీలు పెంచాం. 25 మంది నకిలీ వైద్యుల్లో 18 మందిపై పోలీసులు కేసులు నమోదు చేశారు. మిగిలిన వారి వివరాలు తెలియదు. మత్తు ఇంజక్షన్లు బయటకు రావడంపై విచారణ చేపట్టాం.

లలితాదేవి, జిల్లా వైద్యాధికారిణి, సంగారెడ్డి

ఇలవేల్పులకు పస్తులు.. సొంతానికి నిధులు!

నిఘా

ఆదాయం లేని పురాతన ఆలయాలకు ధూపదీప నైవేద్యం పథకం ద్వారా ప్రభుత్వం ఆర్థిక సాయం అందిస్తోంది. ఎంపిక చేసిన ప్రతి గుడికి నెలకు రూ.10వేలు అందజేస్తోంది. ఇందులో అర్చకుడికి గౌరవ వేతనంగా రూ.7వేలు, నిత్య కైంకర్యాలు, ఖర్చులకు రూ.3 వేలు వెచ్చిస్తున్నారు. పూజలకు నోచని చిన్న, పురాతన ఆలయాలను పరిరక్షించడం ఈ పథకం లక్ష్యం. ఇంత వరకు బాగానే ఉన్నా, ఆలయాల్లో పూజలు చేయకుండానే వేతనాలు తీసుకోవడం, స్థానికంగా ఉండకుండా, వారానికోసారి కూడా ధూపదీప నైవేద్యం పెట్టకుండా కొందరు నెలకు వచ్చే డబ్బులను తమ జేబులో వేసుకుంటున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

న్యూస్‌టుడే, సంగారెడ్డి అర్బన్

974 మందిలో.. 96 మంది అనర్హులు

ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా 274 ఆలయాలున్నాయి. వీటిలో ఆదాయం వచ్చేవి 39 ఉన్నట్లుగా ఆశాఖ అధికారులు పేర్కొంటున్నారు. పథకం వర్తిస్తున్న ఆలయాలపై దేవాదాయ శాఖ మార్చి, ఏప్రిల్‌లో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సెర్ప్ ఆధ్వర్యంలో క్షేత్ర స్థాయిలో విచారణ చేపట్టారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో 974 మందికి రూ.10వేలు మంజూరు చేస్తోంది. ఇందులో 96 మంది అనర్హులుగా తేల్చారు. నెలకు రూ.9.60 లక్షలు దుర్వినియోగం అయినట్లుగా తేల్చారు. ఇందులో కొంత మంది మృతి చెందిన వారు ఉండడం ఆందోళన కలిగిస్తోంది. వారి స్థానంలో కొత్త వారికి అవకాశం కల్పించాలని పలువురు అర్చకులు కోరుతున్నారు. ఇందులో చాలా పల్లెలో, పట్టణాల్లో ఆలయాలు లేకున్నా, పూజలు చేయకున్నా చేసినట్లుగా పేర్లు నమోదు చేసి ఆయా నిధులను తీసుకుంటున్నట్లుగా విమర్శలున్నాయి.

ప్రభుత్వ ఆదేశాల మేరకు నడుచుకుంటాం:

96 మంది అనర్హులుగా తేలింది. అయితే ప్రభుత్వ ఆదేశాల మేరకు నడుచుకుంటాం. ధూపదీప నైవేద్యం సమర్పించకుండా, ఆలయాలు లేకున్నా ఉన్నట్లుగా నెలకు డబ్బులు తీసుకోవడం చట్టరీత్యా నేరం.

విజయరామారావు, సహాయ కమిషనర్, దేవాదాయ శాఖ

అధునాతన పరికరం.. మూలకే పరిమితం!



న్యూస్‌టుడే, జోగిపేట టౌన్: రోగులకు వేగవంతమైన, సురక్షితమైన చికిత్స అందించడంలో ఉపయోగించే త్రీడీ యంత్రాలు నిరుపయోగంగా మారాయి. రూ.లక్షలు వెచ్చించి కొనుగోలు చేసిన ఆ యంత్రాలను రోగుల సేవలకు వినియోగించకుండా ఓ మూలన పడేశారు. పక్షవాతం, వెన్నెముక సమస్యలు, నడుము, మెడ నొప్పులతో బాధపడే రోగులకు వైద్య సేవలందడం లేదు. జోగిపేట ప్రభుత్వ ప్రాంతీయ వంద పడకల ఆసుపత్రిలో రెండున్నరేళ్ల క్రితం తీసుకొచ్చిన త్రీడీ యంత్రంతో పాటు లైట్, ఫోకస్ లైట్లు ప్రస్తుతం నిరుపయోగంగా ఉన్నాయి. వైద్య నిపుణుడు ఉన్నా.. ఓపీలో మందులు రాసేందుకే పరిమితమయ్యారు.

పరిజ్ఞానంపై పట్టు.. సాంకేతికతకు జైకొట్టు

న్యూస్‌టుడే, సంగారెడ్డి మున్సిపాలిటీ

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఆధునిక సాంకేతిక విద్యను చేరువ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రతిష్ఠాత్మక నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో నూతనంగా కంప్యూటర్ ల్యాబ్‌ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. ఈ మేరకు ఒక్కో కళాశాలకు రూ.25 లక్షల చొప్పున నిధులను కేటాయించారు. సమగ్ర శిక్షా అభియాన్ ద్వారా నిధులను అందిస్తూ ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ ఇ.నవీన్ నికోలస్ ఉత్తర్వులు జారీ చేశారు. నిర్మాణాలకు సంబంధించిన విధివిధానాలను స్పష్టం చేశారు.

నైపుణ్యాలకు పదును..

ప్రభుత్వ కళాశాలల్లో ఇంతకాలం కంప్యూటర్ బోధన పూర్తి స్థాయిలో అందుబాటులో లేకపోవడంతో గ్రామీణ ప్రాంత విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాలకు దూరమవుతూ వస్తున్నారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం కళాశాలల్లో ఫిజిక్స్ వాలా ద్వారా ఐఐటీ, జేఈఈ కోచింగ్, ఖాన్ అకాడమీ ద్వారా క్లాట్ తరగతులను ఆన్‌లైన్‌లో నిర్వహిస్తోంది. గతేడాది అన్ని కళాశాలలకు ఫ్లాట్ ప్యానెల్ బోర్డులను అందజేయడంతో డిజిటల్ బోధన ఊపందుకుంది. ఈ తరుణంలో విద్యార్థులకు కంప్యూటర్ పరిజ్ఞానంపై పూర్తి పట్టు సాధించేలా ప్రత్యేక ల్యాబ్‌ల నిర్మాణం ఎంతగానో దోహదపడుతుందని విద్యావర్గాలు భావిస్తున్నాయి. ఇదే స్ఫూర్తితో దశల వారీగా జిల్లాల్లోని మిగతా ప్రభుత్వ కళాశాలల్లోనూ కంప్యూటర్ ల్యాబ్‌లను ఏర్పాటు చేయాలని అధ్యాపకులు, విద్యార్థి సంఘాల ప్రతినిధులు కోరుతున్నారు.

మండలాల వివరాలివీ..

సంగారెడ్డి: సంగారెడ్డి ప్రభుత్వ బాలుర, బాలికలు, నారాయణఖేడ్, పటాన్‌చెరు, రామచంద్రాపురం

సంగారెడ్డి జిల్లాలో కళాశాలలు: 20 ఎంపికైనవి: 5

ఉత్తర్వులు వచ్చాయి..

జిల్లాలో ఐదు కళాశాలల్లో కంప్యూటర్ బోధన అందించాలని ఉత్తర్వులు వచ్చాయి. ఒక్కో కళాశాలకు రూ.25 లక్షల నిధులు కేటాయించారు. కంప్యూటర్ విద్యతో విద్యార్థుల్లో నైపుణాలు పెరుగుతాయి.

-గోవిందరాం, ఇంటర్ నోడల్ అధికారి, సంగారెడ్డి

నిధులతో ఏం చేస్తారంటే..

ప్రత్యేకంగా గది ఏర్పాటు చేస్తారు. కంప్యూటర్లు, కూర్చునేందుకు వీలుగా కుర్చీలు, బల్లలు వంటి ఫర్నిచర్ అందిస్తారు. విద్యార్థులకు ఏఐ, తదితర వాటిని బోధిస్తారు. అన్ని వసతులు సమకూర్చిన తర్వాత అధ్యాపకులకు కంప్యూటర్ బోధనపై ప్రత్యేకంగా శిక్షణ ఇస్తారు.

పరీక్షలు పాసైతేనే ప్రవేశం



బ్రాడ్ జంప్ చేస్తూ..

చేగుంటలోని తెలంగాణ గిరిజన బాలికల క్రీడా పాఠశాలలో ఐదో తరగతిలో ప్రవేశాలకు ఆదివారం దేహదారుఢ్య పరీక్షలను నిర్వహించారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల విద్యార్థినులు పాల్గొన్నారు. మెడిసిన్ త్రోబాల్, బ్రాడ్‌జంప్, షటిల్‌రన్, పరుగు, ఎత్తు, బరువు వంటి పరీక్షలను నిర్వహించారు. ఇందులో అత్యుత్తమ ప్రతిభ చూపితేనే ప్రవేశాలు లభిస్తాయి. విద్యార్థులు ఉదయం నుంచే తమ తల్లిదండ్రులతో క్రీడా పాఠశాలకు చేరుకున్నారు. క్రీడాధికారి రవికుమార్ ఆధ్వర్యంలో ఖాళీగా ఉన్న సీట్లకు కూడా దేహదారుఢ్య పరీక్షలు చేశారు. **-న్యూస్‌టుడే, చేగుంట**

మేళా.. యువత ఆనంద హేల



సంగారెడ్డిలో హాజరైన విద్యార్థులు

న్యూస్‌టుడే, సంగారెడ్డి టౌన్

నవ భారత్..కొత్త అవసరాలు..ఆధునిక సమృద్ధి..ఈ నినాదాలతోనే కేంద్రం ప్రధాన మంత్రి జాతీయ అప్రెంటిస్‌షిప్ మేళాలకు శ్రీకారం చుట్టింది. ఐటీఐ విద్యార్థులకు ఇది వరంలా మారింది. ఈ మేళాల ద్వారా ఐటీఐ విద్యార్థులు కోర్సు పూర్తికాగానే తమకు నచ్చిన కంపెనీలో అప్రెంటిస్‌షిప్‌లో చేరేందుకు అవకాశం కల్పిస్తోంది. ప్రతినెలా మేళాలు ఏర్పాటుచేస్తూ యువత అభ్యున్నతికి బాటలు వేస్తోంది.

● ఐటీఐ అభ్యర్థులకు ప్రయోజనం

జిల్లాలో ఇలా

- ప్రభుత్వ ఐటీఐ కళాశాలలు: 3
- ప్రైవేటువి: 15
- విద్యార్థులు: 5వేలు

ఎదురుచూపులకు చెల్లు

జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు కలిపి 18 ఐటీఐ కళాశాలలు ఉన్నాయి. వీటిల్లో చదువుతున్న విద్యార్థులు 5వేల మంది వరకు ఉన్నారు. వీరు అప్రెంటిస్‌షిప్ కోసం ప్రభుత్వ, ప్రైవేటు పరిశ్రమల పిలుపుకోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి ఉండేది. పరిశ్రమలకు వెళ్లి దరఖాస్తులు సమర్పించినా అవకాశాలు అంతంతే. ఇదే సమయంలో కొన్ని పరిశ్రమలకు సరైన అభ్యర్థులు దొరకడం లేదు. ఈ విషయాన్ని గమనించి అభ్యర్థులు, పరిశ్రమల ప్రతినిధులను ఒకే వేదిక మీదకు తీసుకువచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న అప్రెంటిస్‌షిప్ మేళాలు సమస్యకు పరిష్కారం చూపుతున్నాయి.

ఆధునిక యంత్రాలపై పట్టు

మారుతున్న కాలానికి అనుగుణంగా పరిశ్రమ యాజమాన్యాలు భారీ ఉత్పత్తులు, పెట్టుబడి వ్యయం నియంత్రణ, లాభాల పెంపు లక్ష్యంగా ఆధునిక యంత్రాలను అందుబాటులోకి తీసుకు వస్తున్నాయి. ప్రస్తుతం ఐటీఐ కళాశాలల్లో ఇందుకు అనుగుణంగా యంత్రాలు అందుబాటులో లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొనాల్సి వస్తోంది. అప్రెంటిస్‌షిప్‌లో చేరే విద్యార్థులకు ఆధునిక యంత్రాల వినియోగంపై అవగాహన పెరుగుతుంది. ప్రతిభతో అదే పరిశ్రమలో ఉద్యోగాలు దక్కించుకునేందుకు అవకాశం ఉంటుంది.

అభ్యర్థులకు మంచి అవకాశం:

ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతినెలా రెండో సోమవారం అప్రెంటిస్‌షిప్ మేళాలు నిర్వహిస్తున్నాం. ఒక్కో నెల ఒక్కో ప్రభుత్వ ఐటీఐలో ఉంటుంది. ఐటీఐ పూర్తిచేసిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. అప్రెంటిస్ కోసం గతంలో పరిశ్రమల చుట్టూ తిరగాల్సివచ్చేది. ఇప్పుడు ఆ పరిస్థితి మారింది. పరిశ్రమల ప్రతినిధులు మేళాకు హాజరవుతూ ప్రతిభ ఆధారంగా అవకాశాలు కల్పిస్తున్నారు.

తిరుపతిరెడ్డి, ప్రిన్సిపల్, ప్రభుత్వ ఐటీఐ (సంగారెడ్డి)

ముగిసిన ఆత్యాపత్యా రాష్ట్ర స్థాయి పోటీలు





తృతీయ స్థానంలో నిలిచిన సంగారెడ్డి జిల్లా బాలుర, బాలికల జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న నిర్వాహకులు, పతకాలతో ఇరు జట్ల క్రీడాకారులు

నిర్మల్ అర్బన్, సంగారెడ్డి మున్సిపాలిటీ, న్యూస్‌టుడే : నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో ఆత్యాపత్యా అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి జూనియర్స్ బాలబాలికల పోటీలు ఆదివారం ముగిశాయి. బాలుర విభాగంలో హైదరాబాద్ జిల్లా జట్టు విజేతగా నిలవగా, బాలికల్లో నాగర్‌కర్నూల్ జిల్లా జట్టు ప్రథమ స్థానం కైవసం చేసుకుంది. బాలురలో.. రంగారెడ్డి (ద్వితీయ), తృతీయ స్థానంలో నాగర్‌కర్నూల్, సంగారెడ్డి జిల్లాల జట్లు నిలిచాయి. బాలికల విభాగంలో.. నిర్మల్ (ద్వితీయ), తృతీయ స్థానంలో రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాలు నిలవగా.. క్రీడాకారులకు ట్రోఫీలు అందజేశారు. అతిథులుగా శేఖర్, లక్ష్మణ్, పోశెట్టి, బ్రహ్మయ్య, అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శి భూమన్న హాజరై బహుమతులు అందించారు.

చిరుధాన్యం.. తిరిగొచ్చిన ఆరోగ్యం..

జొన్న రొట్టెల నుంచి మిల్లెట్ బిర్యానీ వరకు

న్యూస్‌టుడే, జహీరాబాద్ అర్బన్, జహీరాబాద్



వంటకాలు ప్రదర్శిస్తున్న మహిళలు

జొన్న రొట్టెలు.. మరోవైపు రాగి దోసెలు.. పక్కనే సజ్జల మురుకులు.. ఇంకో చోట చిరుధాన్యాల ఇడ్లీలు.. యువత అభిరుచికి తగ్గట్లు మిల్లెట్ వెజ్ బిర్యానీ.. ఇలా ఎటు చూసినా సిరిధాన్యాల ఘుమఘుమలే. ఒకప్పుడు ప్రతి ఇంటి కంచంలో కనిపించిన ఈ ఆహారమే, మళ్లీ మన వంటిళ్లలోకి అడుగుపెడుతున్న దృశ్యం జహీరాబాద్‌లో ఆవిష్కృతమైంది. దక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ (డీడీఎస్) కార్యాలయం ఆవరణలో ఆదివారం ప్రపంచ చిరుధాన్యాల దినోత్సవాన్ని పురస్కరించుకుని సిరిధాన్యాల వంటల పోటీలు, అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

100 మంది.. 40కి పైగా రకాల వంటలు..

కార్యక్రమంలో సుమారు 100 మంది మహిళా రైతులు, విద్యార్థులు పాల్గొని చిరుధాన్యాలతో తయారు చేసిన 40కి పైగా రకాల వంటకాలను ప్రదర్శించారు. మహిళా రైతులు తమ పొలాల్లో పండించిన ధాన్యాలతో పూర్వీకుల నాటి వంటకాలు చేస్తే విద్యార్థులు కొత్తతరం అభిరుచికి తగ్గట్టు వినూత్న రుచులను జోడించారు. జొన్న, సజ్జ, బేరికి రొట్టెలు, జొన్న-సజ్జ మురుకులు, రాగి-సజ్జ దోసెలు, చిరుధాన్యాల ఇడ్లీలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అత్యధికంగా వంటకాలు చేసి తెచ్చిన వారికి బహుమతులు, ప్రశంసాపత్రాలు అందించారు. చిరుధాన్యాల్లో పీచు పదార్థం, ఖనిజాలు, ఇతర పోషకాలు సమృద్ధిగా ఉంటాయని డీడీఎస్-కృషి విజ్ఞాన కేంద్రం గృహ విజ్ఞాన శాస్త్రవేత్త డా. హేమలత. అవగాహన సదస్సులో వివరించారు.

మన పొలాల్లో పండిన వాటినే.. .:



అత్త నేర్పిన పద్ధతిలోనే చిరుధాన్యాల పంటలు పండిస్తూ పాతకాలం వంటలు తయారు చేస్తున్నా. పొలాల్లో పండిన వాటిని మనమే తింటే ఆరోగ్యానికి మేలు చేస్తాయి.

చిన్న చంద్రమ్మ, బిడకన్నె

తాత ముత్తాతలు తిన్న తిండి..:



రాగులు, కొర్రలు, సామలు, జొన్నలు, సజ్జలు, అరికలతో 27 రకాల వంటకాలు చేశా. తాతముత్తాతలు తిన్న ఆహారాన్ని మళ్లీ అందరికీ పరిచయం చేయాలన్నదే నా ఉద్దేశం. **మొగులమ్మ, పాట్‌పల్లి**

పిల్లలు, యువత ఇష్టంగా తింటారు..:



చిరుధాన్యాలను నానబెట్టి ఉడికించి కూరగాయలతో మిల్లెట్ వెజ్ బిర్యానీ చేశాం. ఇలాంటి కొత్త రకాల వంటకాలు చేస్తే పిల్లలు, యువత కూడా ఇష్టంగా తింటారు. **సీమా జహా బేగం, విద్యార్థిని**

ఇలా నిలిపితే రాకపోకలు ఎలా?



జాతీయ రహదారి విస్తరణలో భాగంగా రామచంద్రాపురంలో ఇరువైపులా సర్వీసు రోడ్ల పనులు సాగుతున్నాయి. పూర్తికాకముందే ఇష్టానుసారం వాహనాలు నిలుపుతున్నారు. దీంతో తరచూ ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. **- న్యూస్‌టుడే, రామచంద్రాపురం, (జిన్నారం)**

మాకూ కావాలి.. ఓ అథారిటీ

• ఉమ్మడి జిల్లాలో నాలుగు ఏర్పాటుకు అవకాశం

ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరచడంతో పాటు పట్టణాలను మాస్టర్‌ప్లాన్ ప్రకారం అభివృద్ధి చేసేందుకు ఉపయోగపడే అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించాల్సిన అవసరముంది. గత ప్రభుత్వ హయాంలో సిద్దిపేట జిల్లాలో సుడా, గజ్వేల్‌లో గడా పేరిట రెండు యూడీఏలు ఏర్పాటు చేశారు. రాజధానికి సమీపంలో ఉండడంతో ఉమ్మడి జిల్లాలోని సంగారెడ్డి, సిద్దిపేట, నర్సాపూర్, గజ్వేల్ పట్టణాలతో పాటు పారిశ్రామిక ప్రాంతమైన జహీరాబాద్‌లు శరవేగంగా అభివృద్ధి చెందుతున్నాయి. ఈ నేపథ్యంలో ఈ పట్టణాల పరిసర ప్రాంతాలను కలుపుకొని అథారిటీలు ఏర్పాటు చేస్తే సమీప ప్రాంతాలు ప్రగతిపథంలో పయనించనున్నాయి.


సంగారెడ్డి ముఖ చిత్రం

సుడాపై నిర్లక్ష్యం.. ప్రగతికి దూరం

గత ప్రభుత్వ హయాంలో సిద్దిపేట పట్టణంతో పాటు చుట్టూ 20 కి.మీ.ల పరిధిలోని గ్రామాలను కలుపుతూ సుడా(సిద్దిపేట అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ) ఏర్పాటు చేశారు. గత రెండున్నరేళ్ల నుంచి పాలకమండలితో పాటు పర్యవేక్షణకు అధికారిని నియమించడం లేదు. దీంతో ఈ ప్రక్రియ కాగితాలకే పరిమితం అయింది. ఇదే విధంగా గజ్వేల్ నియోజకవర్గ అభివృద్ధి లక్ష్యంగా ఏర్పాటైన గడా భారాస అధికారం కోల్పోవడంతో రద్దయింది.

ప్రజాప్రతినిధులు చొరవ చూపితేనే

రాజకీయాలకు అతీతంగా అధికార, ప్రతిపక్ష పార్టీలకు చెందిన ఎమ్మెల్యేలు ప్రభుత్వ పెద్దలపై ఒత్తిడి తీసుకొస్తేనే అథారిటీల ఏర్పాటుకు మార్గం సుగమం కానుంది. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంగారెడ్డి జిల్లా కేంద్రంలో పర్యటించిన సమయంలో వీటి ఏర్పాటును ప్రకటిస్తారని ఉమ్మడి జిల్లా ప్రజలు ఆశించినా నిరాశే ఎదురైంది. -ఈనాడు, సంగారెడ్డి

జోరుగా స్థిరాస్తి వ్యాపారం

రాజధానికి సమీపంలో ఉండడంతో సంగారెడ్డి జిల్లా కేంద్రంతో పాటు పరిసర ప్రాంతాల్లో స్థిరాస్తి వ్యాపారం జోరందుకుంది. దేశవిదేశాలకు చెందిన పేరొందిన సంస్థలు ఈ ప్రాంతంలో భూముల మీద పెట్టుబడులు పెడుతున్నాయి. స్థిరాస్తి వెంచర్లు ఏర్పాటు చేసి తమ వ్యాపార కార్యకలపాలు చేపడుతున్నాయి. ఈ నేపథ్యంలో సంగారెడ్డి జిల్లా కేంద్రంగా సంగారెడ్డి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. ఇదేవిధంగా జహీరాబాద్‌లో ఏర్పాటు చేస్తున్న నిమ్జ్(జాతీయ పెట్టుబడుల ఉత్పత్తి మండలి)లో పారిశ్రామిక స్మార్ట్ సిటీ ఏర్పాటుకు కేంద్రం ఆమోదం తెలిపి ప్రత్యేకంగా నిధులు మంజూరు చేస్తోంది. ఈ క్రమంలోనే జహీరాబాద్‌తో పాటు సమీప గ్రామాలను కలుపుతూ జహీరాబాద్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీని ఏర్పాటు చేస్తేనే ప్రణాళికయుతంగా పట్టణీకరణ జరగనుంది. నర్సాపూర్, గజ్వేల్ పట్టణాలకు అవకాశాలున్నాయి.

ఉపయోగాలు ఇలా..

• యూడీఏ ఏర్పాటైతే పట్టణ ప్రాంతాల సమగ్ర, క్రమబద్ధమైన అభివృద్ధికి ప్రణాళిక రూపొందించి అమలు చేయొచ్చు. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని పట్టణాభివృద్ధి సంస్థల నుంచి ప్రత్యేకంగా నిధులు మంజూరవుతాయి.

• మౌలిక సదుపాయాల కల్పనతో పాటు నివాసయోగ్యమైన పట్టణ జీవనాన్ని ప్రోత్సహించవచ్చు. మాస్టర్ ప్లాన్ రూపొందించి భూ వినియోగాన్ని నియంత్రించొచ్చు. • కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ వివిధ పథకాల ద్వారా లభించే నిధులతో కాలనీలు, శివారు గ్రామాల స్వరూపం మారుతుంది. ప్రత్యేక జోన్లు ఏర్పాటు చేసి పెట్టుబడులను ఆకర్షించడంతో స్థానికంగా ఉపాధి పెరుగుతుంది.

మమ్మేలు.. కొమురవెల్లి మల్లన్న


అధికారులు, అర్చకులకు వెండి బిందె, చెంబు అందజేస్తున్న దాతలు


కొమురవెల్లి: ప్రసాదాల కోసం వరుసలో భక్తులు

చేర్యాల, న్యూస్‌టుడే: 'మొక్కులు తీర్చుకున్నం మల్లన్నా.. చల్లంగా దీవించన్నా..' అంటూ భక్తుల వేడుకోలుతో కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయం ఆదివారం మార్మోగింది. శ్రావణ మాసం కావడంతో స్వామి దర్శనానికి వేలాదిగా తరలివచ్చిన భక్తులతో ఆలయ పరిసరాల్లో సందడి నెలకొంది. స్వామి దర్శన, ప్రసాదాల క్యూలైన్లలో భక్తులు బారులుదీరారు. మల్లన్న దర్శనానికి 3 గంటల సమయం పట్టింది. 37 కుటుంబాలు అభిషేకం నిర్వహించగా, 24 కుటుంబాల సభ్యులు మల్లికార్జునస్వామి కల్యాణోత్సవంలో పాల్గొన్నారని, 20 వేల మంది దర్శించుకున్నారని ఆలయ వర్గాలు తెలిపాయి. కొమురవెల్లికి చెందిన అంబటిపల్లి యాదలక్ష్మి కుటుంబ సభ్యులు సుమారు రూ.4 లక్షల విలువైన 1.876 కిలోల వెండితో తయారు చేయించిన బిందె, చెంబులను సమర్పించారు. ఆలయ పర్యవేక్షకుడు చంద్రశేఖర్, ప్రధానార్చకుడు మల్లికార్జున్, ఆలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఆంజనేయులుకు దాతలు అంబటిపల్లి మల్లికార్జున్, వెంకటనరేందర్, రాము అందించారు.

బీడీ కార్మికులకు జీవనభృతి అమలు చేయాలి: సీఐటీయూ



మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి పద్మశ్రీ

సిద్దిపేట అర్బన్, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు బీడీ కార్మికులందరికీ జీవనభృతి రూ.4016 వెంటనే అమలు చేయాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పద్మశ్రీ డిమాండ్ చేశారు. సిద్దిపేట పట్టణంలోని విపంచి కళానిలయంలో ఆదివారం నిర్వహించిన బీడీ సిగార్, వర్కర్స్ యూనియన్ రాష్ట్ర మహాసభలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో బీడీ పరిశ్రమపై ఆధారపడి సుమారు 7లక్షల మంది కార్మికులు పని చేస్తున్నారని తెలిపారు. ఎన్నికల సమయంలో. అధికారంలోకి వస్తే బీడీ కార్మికులందరికీ ప్రస్తుతం ఇస్తున్న భృతిని రూ.4016లకు పెంచుతామని కాంగ్రెస్ పార్టీ ప్రకటించినప్పటికీ ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. కార్మికుల పింఛను రూ.7500లకు పెంచాలని, వెంటనే కనీస వేతనాల జీవోను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మహాసభలో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమ, సీఐటీయూ నేతలు సుధాకర్, గోపాలస్వామి, భాస్కర్, శశిధర్, రవికుమార్, శోభ, కార్మికులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీల్లో మెదక్ వాసి ప్రతిభ


అందుకున్న పతకాలు చూపిస్తున్న ప్రభు

మెదక్ టౌన్, న్యూస్‌టుడే: తెలంగాణ రాష్ట్ర మాస్టర్ అథ్లెటిక్స్ రాష్ట్ర స్థాయి పోటీలు ఆదివారం హైదరాబాద్‌లోని జింఖానా మైదానంలో జరిగాయి. మెదక్ పట్టణానికి చెందిన కొక్కొండ ప్రభు 65 ఏళ్ల విభాగంలో పాల్గొని లాంగ్‌జంప్, షాట్‌పుట్‌లో తృతీయ స్థానంలో నిలిచారు. నిర్వాహకుల చేతుల మీదుగా పతకాలను అందుకున్నారు. మెదక్ జిల్లా క్రీడాకారులు, మాస్టర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మధుసూదన్, రాజేందర్ తదితరులు ఆయన్ను అభినందించారు.

ఉత్సాహంగా ఉమ్మడి జిల్లా క్రికెట్ ఎంపికలు


పాల్గొన్న క్రీడాకారులు

సంగారెడ్డి మున్సిపాలిటీ, న్యూస్‌టుడే: సంగారెడ్డి పట్టణంలోని ఎంఎస్ క్రికెట్ మైదానంలో ఉమ్మడి మెదక్ జిల్లా అండర్-16 ఎంపికలు ఆదివారం నిర్వహించారు. మూడు జిల్లాల నుంచి 124 మంది క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం ఉమ్మడి మెదక్ జిల్లా జట్టును ఎంపిక చేశారు. ఎంపికైన వారు సెప్టెంబరు 7 నుంచి హైదరాబాద్‌లో నిర్వహించనున్న అండర్-16 టోర్నీలో పాల్గొనాల్సి ఉంటుందని ఉమ్మడి జిల్లా కార్యదర్శి రాజేందర్ రెడ్డి తెలిపారు.

నిధులు కేటాయిస్తేనే గుణాత్మక విద్య


మాట్లాడుతున్న విద్యా పరిరక్షణ కమిటీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి ఆచార్య లక్ష్మీనారాయణ

సంగారెడ్డి మున్సిపాలిటీ, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసి నాణ్యమైన విద్య అందించాలని విద్యా పరిరక్షణ కమిటీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి ఆచార్య లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన సంగారెడ్డి పట్టణంలోని టీపీటీఎఫ్ భవన్‌లో 'ప్రభుత్వ బడుల బలోపేతం- ప్రభుత్వ బాధ్యత- మనకర్తవ్యం' అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించి మాట్లాడారు. విద్యకు 20 శాతం నిధులు కేటాయిస్తేనే గుణాత్మక విద్య అందుతుందని తెలిపారు. 23 వేల బడులను మూసివేయాలని ప్రభుత్వం నిర్ణయించడం సరికాదని పేర్కొన్నారు. విద్య ప్రైవేటీకరణ వల్ల ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు మూత పడుతున్నాయని ఆరోపించారు. సంఘం రాష్ట్ర సహాధ్యక్షుడు వై.అశోక్ కుమార్ మాట్లాడుతూ.. విద్యారంగాన్ని పరిరక్షించుకునేందుకు ఉపాధ్యాయ, విద్యార్థి సంఘాలు ముందుకు రావాలని కోరారు. సంఘం జిల్లా అధ్యక్షుడు సోమశేఖర్, ప్రధాన కార్యదర్శి రాంచందర్, ఎస్టీయూ రాష్ట్ర కోశాధికారి సయ్యద్ సాబేర్‌అలీ, ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుభాన్‌సింగ్, జిల్లా అధ్యక్షుడు దుర్గయ్య, యూఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సందీప్ తదితరులు పాల్గొన్నారు.

భూములు.. అధికారాలను లాక్కుంటారా?

• ఉత్తర్వులపై సర్పంచుల మండిపాటు • టీజీఐఐసీ, గ్రామీణాభివృద్ధి శాఖల నిర్ణయంపై నిరసనలు

న్యూస్‌టుడే, జహీరాబాద్ అర్బన్, ఝరాసంగం, న్యాల్‌కల్: జహీరాబాద్ నిమ్జ్(జాతీయ ఉత్పాదక పెట్టుబడుల మండలి) ఏర్పాటు ప్రక్రియలో జారీ చేసిన కొత్త నిబంధన స్థానికంగా తీవ్ర ఆందోళనలకు దారితీస్తోంది. ఇప్పటికే సారవంతమైన భూములు కోల్పోయి రోడ్డున పడుతున్న రైతులకు తాజాగా ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులు మరింత శరాఘాతంగా పరిణమించాయి. పరిశ్రమల పేరుతో భూములు సేకరించడమే కాకుండా స్థానిక గ్రామ పంచాయతీల అధికారాలను టీజీఐఐసీ, పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి శాఖలకు బదలాయించాలంటూ జారీ అయిన సంయుక్త నోటిఫికేషన్ ఇప్పుడు చర్చనీయాంశమైంది. ప్రజాప్రతినిధులు, రైతులు, గ్రామస్థుల హక్కులను కాలరాసేలా ఉన్న ఈ నిర్ణయంపై సర్వత్రా నిరసన వ్యక్తమవుతోంది.

బదలాయింపుతో ఆదాయానికి గండి..

ఝరాసంగం మండలంలోని 3, న్యాల్‌కల్ మండలంలోని 14 గ్రామాల పరిధిలో నిమ్జ్ కోసం భూసేకరణ చేపడుతున్నారు. ఈ క్రమంలో టీజీఐఐసీ, పంచాయతీరాజ్ శాఖలు సంయుక్తంగా జారీ చేసిన నోటిఫికేషన్ స్థానిక సర్పంచులను విస్మయానికి గురిచేస్తోంది. సేకరించిన భూముల్లో భవిష్యత్తులో పరిశ్రమలు ఏర్పాటయ్యాక వచ్చే ఎలాంటి ఆదాయం ఆయా గ్రామ పంచాయతీలకు చెందకుండా నేరుగా టీజీఐఐసీకి జమయ్యేలా తీర్మానాలు పంపాలని ఆదేశించడంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. ఇది పంచాయతీల స్వయం ప్రతిపత్తిని దెబ్బతీసేలా ఉందని, సర్పంచులు, వార్డు సభ్యుల అధికారాలను లాక్కునే కుట్ర జరుగుతోందని ప్రజాప్రతినిధులు ఆరోపిస్తున్నారు. దీనిని తీవ్రంగా వ్యతిరేకించిన 17 పంచాయతీలు అధికారాల బదలాయింపునకు వ్యతిరేకంగా ఇప్పటికే తీర్మానాలు చేయడం గమనార్హం.


ఎల్గోయిలో గ్రామసభ నిర్వహిస్తున్న పంచాయతీ పాలకులు

హామీల అమలు ఉత్తిమాటేనా..?

బాధితులకు పరిశ్రమల్లో ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు స్థానిక గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని సర్పంచులు డిమాండు చేస్తున్నారు. గతేడాది జహీరాబాద్‌లో పర్యటించిన సీఎం రేవంత్‌రెడ్డి భూ బాధితులకు ఇచ్చిన ఇందిరమ్మ ఇళ్ల హామీ ఇప్పటికీ నెరవేరలేదని ప్రజలు గుర్తుచేస్తున్నారు. తమ పొట్ట కొట్టి అధికారాలను లాక్కునే నిర్ణయాలను తక్షణమే వెనక్కి తీసుకోవాలని లేనిపక్షంలో ఆందోళనలను మరింత ఉద్ధృతం చేస్తామని రైతులు హెచ్చరిస్తున్నారు.

అదనపు సర్వే నంబర్ల కలకలం..

ఒకవైపు అధికారాల కోతతో సర్పంచులు రగిలిపోతుంటే.. మరోవైపు అదనపు సర్వే నంబర్ల చేరిక రైతుల్లో గుబులు పుట్టిస్తోంది. ఏడాదికి మూడు పంటలు పండే సారవంతమైన భూములు కోల్పోతున్న తరుణంలో ముందస్తు సమాచారం లేకుండా అదనంగా మరిన్ని సర్వే నంబర్లను జాబితాలో చేర్చడంపై ప్రజలు మండిపడుతున్నారు. ఉన్న కొద్దిపాటి భూమిని లాక్కుంటే తమ బతుకులు వీధిన పడతాయని రైతులు వాపోతున్నారు. జాబితాలో చేరిన అదనపు సర్వే నంబర్లను వెంటనే తొలగించాలని జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు టీజీఐఐసీ ఈడీ వీరారెడ్డిని కలిసి సమస్య వివరించారు.

ఉత్తర్వుల సమాచారం అందలేదు..

నిమ్జ్ భూసేకరణ గ్రామాల్లో పంచాయతీల అధికార బదలాంపులపై రెవెన్యూ శాఖకు ఉత్తర్వుల సమాచారం అందలేదు. భూసేకరణ సహా మిగతా వ్యవహారాలు నిమ్జ్ భూసేకరణ అధికారులు చూసుకుంటారు. -దేవుజా, ఆర్డీవో జహీరాబాద్

విద్యార్థి భవితకు.. విజ్ఞాన్ మంథన్

▲ సెప్టెంబరు 30వరకు దరఖాస్తులకు గడువు

జిల్లా	ఉన్నత పాఠశాలలు	విద్యార్థులు	కళాశాలలు	విద్యార్థులు
సిద్దిపేట	579	87,224	20	6,443
సంగారెడ్డి	211	67,500	20	6,400
మెదక్	156	28,636	16	5,669
వికారాబాద్	176	30,200	14	5,500

న్యూస్‌టుడే, సిద్దిపేట గ్రామీణం, సంగారెడ్డి మున్సిపాలిటీ, చేగుంట: విద్యార్థి విజ్ఞాన్ మంథన్ ఆరో తరగతి నుంచి ఇంటర్ (11వ తరగతి) వరకు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న వారు ఇస్రో, డీఆర్డీవో శాస్త్రవేత్తలతో నేరుగా సంభాషించే సువర్ణావకాశం కల్పిస్తోంది. ఈ క్రమంలోనే నగదు పురస్కారాలు, భాస్కర పేరిట ఉపకార వేతనాలు అందిస్తున్నాయి. విద్యార్థుల్లోని శాస్త్రీయ నైపుణ్యాన్ని గుర్తించి విజ్ఞానశాస్త్ర రంగంలో దేశ పురోగతిపై అవగాహన, ప్రయోగాలపై మక్కువ పెంచడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏటా పలు కార్యక్రమాలు అమలు చేస్తున్నాయి. ఇందులో భాగంగా విజ్ఞానభారతి, విజ్ఞాన ప్రసార్, ఎన్సీఈఆర్టీ సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థి విజ్ఞాన్ మంథన్(వీవీఎం) పేరిట ప్రతిభా పరీక్ష నిర్వహిస్తున్నారు.

అర్హులు.. నమోదు ఇలా..

6 నుంచి 11వ తరగతులు చదువుతున్న విద్యార్థులు అర్హులు. రూ.200 ఫీజు చెల్లించి సెప్టెంబరు 30వ తేదీలోపు అధికారిక వెబ్‌సైట్ https://vvm.org.in ద్వారా వివరాలు నమోదు చేసుకోవాలి. ఆన్‌లైన్ విధానంలో తెలుగు, ఆంగ్లం, హిందీతో పాటు ఇతర ప్రధాన ప్రాంతీయ భాషల్లో పరీక్ష ఉంటుంది. వెబ్‌సైట్ లేదా చరవాణి యాప్ ఆధారితంగా పరీక్ష రాయొచ్చు. జూనియర్ విభాగంలో 6, 7, 8 తరగతులు, సీనియర్ విభాగంలో 9, 10, 11 తరగతులు ఉంటాయి. చరవాణి, ట్యాబ్, ల్యాప్‌టాప్, డెస్క్‌టాప్ ఏదైనా వినియోగించి పరీక్ష రాయొచ్చు.

ఇవీ ప్రయోజనాలు...

పోటీలు జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఉంటాయి. రాష్ట్ర, జాతీయస్థాయిలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు నగదు పురస్కారం, ప్రశంసా పత్రాలు అందజేస్తారు. జాతీయస్థాయి క్యాంపులు, శ్రీజాన్ ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాం కింద ఇస్రో, డీఆర్డీవో, సీఎస్ఐఆర్, బీఏఆర్సీ వంటి ప్రముఖ పరిశోధన సంస్థల శాస్త్రవేత్తలతో నేరుగా సంభాషించడం, శిక్షణ పొందే అవకాశం లభిస్తుంది. విజేతలకు భాస్కర పేరిట ఉపకార వేతనాలు, ప్రముఖ సైన్స్ ప్రయోగశాలలు సందర్శించే అవకాశం కల్పిస్తారు. విద్యార్థుల భవిష్యత్తుకు విజ్ఞాన్ మంథన్ ఎంతో ఉపయోగపడుతుందని, దీనిపై పాఠశాల యాజమాన్యాలు విద్యార్థులకు అవగాహన కల్పించాలని సిద్దిపేట డీఈవో రమేశ్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి



చేర్యాల, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళ సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ చనిపోయింది. చేర్యాలకు చెందిన యాంసాని పాండు, **వసంత** (59) ద్విచక్రవాహనంపై శనివారం సిద్దిపేటకు వెళ్లి తిరిగి ఆదివారం ఇంటికి వస్తున్నారు. కొమురవెల్లి ఠాణా పరిధిలోని గుర్జకుంట క్రాస్‌రోడ్డు వద్ద ఎదురుగా వచ్చిన కారు ఢీకొట్టింది. ప్రమాదంలో పాండుకు స్వల్ప గాయాలు కాగా, వసంత తలకు బలమైన గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే చేర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి, అక్కడ్నుంచి సిద్దిపేటకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదైంది.

ముడిసరకొచ్చింది.. ఇక్కత్ గిరాకీ పెరిగింది


దారాల నుంచి బీమ్‌లు పోస్తూ..

దుబ్బాక, న్యూస్‌టుడే: చేనేత సహకార సంఘం ఎన్నికలు పూర్తయి పాలకమండలి ఏర్పడటంతో వస్త్రాల తయారీ.. గిరాకీకి తగినట్టుగా సంస్థలకు అందించే పనుల్లో నేతకార్మికులు నిమగ్నమయ్యారు. రూ.8 లక్షల విలువైన ముడి సరుకు వచ్చింది. ప్రతి నెలా ఆర్డర్లను పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నారు. సిద్దిపేట జిల్లా దుబ్బాక ప్రాంతంలో ప్రస్తుతం తక్కువ సంఖ్యలో చేనేత కార్మికులు ఈ వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నారు. విభిన్న రంగుల్లో కాటన్, జరీ, పట్టు చీరలతో పాటు ఇక్కత్ చీరలు, లెనిన్ కాటన్ వస్త్రాలను తయారు చేస్తున్నారు. దుబ్బాక చేనేత సొసైటీలో ప్రస్తుతం 40 మగ్గాలతో 36 మంది కార్మికులు పోచంపల్లి ఇక్కత్ చీరలు, కాటన్ టవల్స్, బెడ్‌షీట్స్ వంటివి నేస్తున్నారు. మరో 15 మంది కండెలు చుట్టడం, బీమ్‌లు పోయడం, నింపడం చేపడుతున్నారు.

దుబ్బాక సొసైటీ పనులు, ప్రణాళిక

◆ 8 మగ్గాలపై పోచంపల్లి ఇక్కత్ చీరలు తయారుచేస్తారు. ◆ 25 మగ్గాల మీద రోజూ 200 కాటన్ తువ్వాళ్లు ◆ సీతాకోకచిలుక, శంఖం, పూల ఆకృతుల్లో ఇక్కత్ చీర తయారవుతుంది. ◆ కార్మికులంతా రోజూ 6 చీరలు నేస్తున్నారు. ◆ ఖర్చులు రూ.2500; తెలంగాణ రాష్ట్ర చేనేత సహకార సంఘం (టెస్కో) కొనుగోలు ధర రూ.2800 ఉంటోంది. ◆ తువ్వాలు ఒక్కంటికి రూ.160 ఖర్చు; టెస్కో కొనుగోలు ధర రూ.180 ఉంటోంది. ◆ జకార్డు మగ్గాలు కేవలం 2 ఉన్నాయి. ఇటీవల మరొకటి కొనుగోలు చేశారు. ◆ ప్యూర్ పట్టు.. కాటన్ జరీ.. గొల్లభామ చీరల తయారీ స్వల్పం. ◆ రూ.8 లక్షలతో ముడిసరుకు కొన్నారు. కార్మికుల 3 నెలల వేతనాలు సైతం సొసైటీ చెల్లించింది.

విలువైన పట్టు జరీ చీరలు సైతం తయారుచేస్తాం..

చేనేత కార్మికుల సంక్షేమమే లక్ష్యంగా అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నాం. ఉపాధికి అండగా నిలుస్తున్నాం. అన్ని రకాల ఆకృతులతో, విభిన్న రంగుల్లో నేస్తున్న పోచంపల్లి ఇక్కత్ చీరలు, కాటన్ టవల్స్‌కు గిరాకీ పెరిగింది. త్వరలోనే అధిక ధర కలిగిన పట్టు జరీ చీరలను నేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నాం.
-అంకం మధు, దుబ్బాక చేనేత సహకార సొసైటీ ఛైర్మన్

మార్జాలంపై మమకారం

• గాయపడిన పిల్లికి శస్త్రచికిత్స చేయించి కాపాడిన జూనియర్ అసిస్టెంట్



న్యూస్‌టుడే, హుస్నాబాద్ గ్రామీణం: తీవ్రంగా గాయపడిన పిల్లి పిల్లకి శస్త్రచికిత్స చేయించడమే కాకుండా రోజూ అవసరమైన సపర్యలు చేస్తున్నారు.. ఆయనే సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండల పరిషత్తు కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న కొండం తిరుమల్‌రెడ్డి. జనగామ జిల్లా తరిగొప్పుల గ్రామం ఆయన సొంతూరు. మూడు నెలల క్రితం తరిగొప్పులలోని ఆయన ఇంట్లో ఓ పిల్లి పిల్లలను పెట్టింది. 15 రోజుల తర్వాత అందులోని ఓ పిల్లికూన ఇంటి ముందు రోడ్డుపై వెళ్తుండగా కుక్క దాడి చేసింది. తీవ్రంగా గాయపడిన పిల్లి కూన వెనుక రెండు కాళ్లు దెబ్బతిని నడవలేక పోయింది.

వదిలేయలేదు

గమనించిన తిరుమల్‌రెడ్డి ఊరకే వదిలేయకుండా పిల్లి పిల్లను ఇంట్లోకి తెచ్చారు. సమీపంలోని ప్రభుత్వ పశువైద్యశాలకు తీసుకువెళ్లి చూపించగా పరీక్షించిన వైద్యులు అది బతకడం కష్టమని వదిలేయమని సలహా ఇచ్చారు. ఆయన దానిని వదలేయలేదు. అక్కడి నుంచి వరంగల్‌లోని పశువైద్యశాలలో చికిత్స చేయించారు. కాస్త కోలుకున్నా నడవలేక పోయింది. తర్వాత హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని వెటర్నరీ యూనివర్సిటీకి తీసుకువెళ్లి అక్కడి వైద్యులకు చూపించారు. వారు సర్జరీ చేయాలని చెప్పి కొన్ని మందులు సూచించారు. రెండు రోజుల అనంతరం హనుమకొండలోని ప్రైవేటు పశువైద్యశాలలో చూపించారు. వైద్యులు పలు పరీక్షలు చేసి పిల్లికి నడుముతో పాటు కాళ్లకు శస్త్రచికిత్స చేశారు. బాగా దెబ్బతిన్న ఒక కాలును తొలగించారు. ప్రస్తుతం ఇంట్లో ప్రత్యేక బోనులో ఉంచి ఆయన సంరక్షిస్తున్నారు. ఇన్‌ఫెక్షన్ కాకుండా ఉండటానికి దాని మెడకు కాలర్ ఏర్పాటు చేశారు. ప్రస్తుతం మూడు కాళ్లతో నిలబడుతూ మెల్లగా నడవడానికి యత్నిస్తోంది. వైద్యం కోసం ఆయన ఇప్పటికే రూ.50 వేలు ఖర్చు చేశారు. ఇంజక్షన్లు, యాంటీబయాటిక్స్ మందులు, పాలు, ఇతర ఆహారం తదితరాలకు రోజూ రూ.200 ఖర్చవుతున్నట్లు తిరుమల్ రెడ్డి తెలిపారు. గాయం పూర్తిగా మానిన తర్వాత కృత్రిమ కాలు కోసం ప్రయత్నిస్తానన్నారు.

ద్విచక్ర వాహనాలు ఢీకొని వివాహిత దుర్మరణం



రాయపోల్, న్యూస్‌టుడే: ఎదురెదురుగా వస్తున్న రెండు దిచక్ర వాహనాలు ఢీకొని మహిళ దుర్మరణం చెందింది. భర్తకు గాయాలయ్యాయి. మరో వాహనంపై ప్రయాణిస్తున్న వ్యక్తికి గాయాలు కాలేదు. ఎస్ఐ మానస తెలిపిన వివరాలు.. సిద్దిపేట జిల్లా రాయపోల్ మండలం తిమ్మక్‌పల్లి గ్రామానికి చెందిన దంపతులు ఉడిది రామస్వామి, **అమృత** (48) వ్యవసాయం పనులు చేస్తుంటారు. శనివారం ఉదయం తమ ద్విచక్ర వాహనంపై పొలానికి వెళ్లి తిరిగి సాయంత్రం ఇంటికి బయలు దేరారు. రాయపోల్ నుంచి దౌల్తాబాద్ వైపు వెళ్తున్న మరో వాహనం ఢీకొట్టింది. రామస్వామి కాళ్లకు, భార్య అమృత తలకు తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు గజ్వేల్ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలిస్తుండగా దారిలో ఆమె మృతి చెందింది. కుమార్తె మరియ ఆదివారం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కారు దగ్ధం.. తప్పిన ప్రమాదం


దగ్ధమవుతున్న కారు

చేగుంట, న్యూస్‌టుడే: కారులో ఒక్కసారిగా మంటలు ఎగసి పడి త్రుటిలో ప్రమాదం తప్పిన ఘటన మెదక్ జిల్లా చేగుంట సమీపంలోని 44వ జాతీయ రహదారి బైపాస్‌లో ఆదివారం చోటుచేసుకుంది. కామారెడ్డి జిల్లా భిక్కనూరుకు చెందిన మనోజ్, మీనాక్షితో పాటు మరొకరు కారులో హైదరాబాద్‌కు బయలుదేరారు. చేగుంట బైపాస్ సర్కిల్ వంతెనపైకి రాగానే పొగలు వచ్చాయి. వంతెన దిగిన తర్వాత కారును పక్కకు ఆపి అందులో ప్రయాణిస్తున్న వారు దిగి బ్యానెట్ తెరిచి చూస్తుండగానే మంటలు పెద్ద ఎత్తున వ్యాపించాయి. గ్యాస్‌తో నడిచే కారు కావడంతో షార్ట్‌సర్క్యూట్ అయి మంటలు చెలరేగి ఉంటాయని పోలీసులు భావిస్తున్నారు. రామాయంపేట నుంచి అగ్నిమాపక శకటం వచ్చి మంటలు ఆర్పివేసింది. అప్పటికే కారు పూర్తిగా దగ్ధమైంది.

చికెన్ ధరలు			
ఫాంరేటు	117-00	డ్రెస్డ్	223-00
రిటైల్	144-00	స్కిన్‌లెస్	252-00

టీపీఎస్‌లుగా ఆదర్శ పాఠశాలలు

• గ్రామీణ విద్యార్థులకు వరం


సంగారెడ్డి జిల్లాలోని మోర్గి పాఠశాల

న్యూస్‌టుడే, మనూరు: గ్రామీణ పేద విద్యార్థులకు ఆంగ్ల మాధ్యమ విద్య అందించేందుకు ప్రభుత్వం ఆదర్శ పాఠశాలలను నెలకొల్పింది. ఆరో తరగతి నుంచి ఇంటర్ వరకు తరగతులు కొనసాగుతున్నాయి. సత్ఫలితాలు వస్తుండటంతో వాటిని తెలంగాణ పబ్లిక్ స్కూళ్ల(టీపీఎస్)గా మార్చాలని ప్రభుత్వం యోచిస్తోంది. పూర్వ ప్రాథమిక విద్య నుంచి అయిదో తరగతి వరకు ప్రవేశపెట్టేలా చర్యలు చేపట్టింది. ఇప్పటికే రాష్ట్ర పరిశీలకులు శ్రీనివాసచారి ఆధ్వర్యంలోని బృందం పాఠశాలలను సందర్శించి నివేదికలను రూపొందించింది.

రెట్టింపు దరఖాస్తులు వస్తున్నాయి

పూర్వ ప్రాథమిక పాఠశాల విద్య అందుబాటులోకి వస్తే విద్యార్థులకు మేలు చేకూరుతుంది. ఇప్పటికే ఏటా ప్రవేశాల కోసం రెట్టింపు దరఖాస్తులు వస్తున్నాయి. టీపీఎస్‌గా మారితే మరింత డిమాండు పెరుగుతుంది.
-సువర్ణ, ప్రిన్సిపల్ ఆదర్శ పాఠశాల, మోర్గి, సంగారెడ్డి జిల్లా

మూడు జిల్లాల్లో ఇలా..

రాష్ట్ర వ్యాప్తంగా 194 ఆదర్శ పాఠశాలలున్నాయి. ఇందులో ఉమ్మడి మెదక్ జిల్లాలో 31 ఉన్నాయి. 2026-27 విద్యా సంవత్సరంలో ప్రీప్రైమరీ పాఠశాలలను ప్రారంభించేందుకు ప్రభుత్వం కసరత్తు చేపట్టింది. ఇటీవల రాష్ట్ర బృందం సభ్యులు పాఠశాలలను సందర్శించి సౌకర్యాలు, తదితర వివరాలపై ఆరా తీశారు. ప్రస్తుతం ఆదర్శ పాఠశాలల్లో వంద మంది ఇంటర్ బాలికలకు మాత్రమే వసతి గృహ సౌకర్యం కల్పిస్తున్నారు. ప్రీప్రైమరీ (నర్సరీ) నుంచి 5వ తరగతి వరకు ప్రవేశపెట్టి.. మరిన్ని సౌకర్యాలు కల్పిస్తే అందులో చేరిన విద్యార్థి ఇంటర్ వరకు చదువుకోవచ్చు. అంతేకాదు టీపీఎస్‌లో ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనంతో పాటు సాయంత్రం స్నాక్స్ అందిస్తారు. దీంతో ఆకలి బాధలు సైతం ఉండవు. ప్రత్యేకంగా బస్సు సౌకర్యం కల్పిస్తే ఇంటి నుంచే రాకపోకలు సాగించాల్సి ఉంటుంది. ఇది పేద విద్యార్థులకు వరంగా మారనుంది.

ఆదర్శ పాఠశాలల వివరాలు

సంగారెడ్డి: మోర్గి, అక్సాన్‌పల్లి, బస్వాపూర్, బొల్లారం, మాచునూర్, ఝరాసంగం, మునిపల్లి, పోతులబొగుడ, రాయికోడ్, వెలిమెల
మెదక్: చేగుంట, జక్కపల్లి, కోమట్‌పల్లి, రేగోడ్, పెద్దశంకరంపేట, టేక్మాల్, తిర్మలాపూర్
సిద్దిపేట: బెజ్జంకి, హుస్నాబాద్, సముద్రాల, నంగునూరు, మిరుదొడ్డి, ఇర్కోడ్, లచ్చపేట, చిన్నకోడూరు, జగదేవపూర్, కొండపాక, ముబ్రాజ్‌పల్లి, దౌల్తాబాద్, చేర్యాల, మద్దూరు

జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు రిఫరీగా అందోలు వాసి


తరుణ్‌రాజ్, పీఈటీ

జోగిపేట టౌన్, న్యూస్‌టుడే: హైదరాబాద్‌లో జూన్ 8 నుంచి 11వ తేదీ వరకు నిర్వహించిన అమ్‌ట్యూర్ కబడ్డీ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఏకేఎఫ్ఐ) జాతీయ కబడ్డీ పోటీల రిఫరీ(న్యాయ నిర్ణేత) పరీక్షలో సంగారెడ్డి జిల్లా అందోలు గ్రామానికి చెందిన తరుణ్‌రాజ్ ఉత్తీర్ణత సాధించినట్లు నిర్వాహకులు తెలిపారు. కబడ్డీ కోచ్‌గా సేవలందిస్తూ జాతీయ స్థాయి పోటీలకు రిఫరీగా అర్హత సాధించడంపై అందోలు క్రీడాభివృద్ధి కమిటీ, జిల్లా క్రీడాకారులు హర్షం వ్యక్తం చేశారు. ప్రస్తుతం తరుణ్‌రాజ్ సంగారెడ్డి మహాత్మా జ్యోతిబా ఫులే గురుకుల పాఠశాలలో పీఈటీగా పనిచేస్తున్నారు.

గ్రామాల్లో వసతులు కల్పించడమే లక్ష్యం: ఎమ్మెల్యే


భూమిపూజ చేస్తున్న సంజీవరెడ్డి

సిర్గాపూర్, కంగ్టి, మనూరు, న్యూస్‌టుడే: గ్రామాల్లో కనీస వసతులు కల్పించడానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని ఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి అన్నారు. ఆయన సిర్గాపూర్ మండలం అంతర్గాం గ్రామంలో సీసీ రోడ్డు, మురుగు కాలువల నిర్మాణానికి భూమి పూజ చేసి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు మెరుగైన సేవలందించాలనే ఉద్దేశంతో రహదారులు, మురుగు కాలువలు నిర్మిస్తున్నట్లు చెప్పారు. ఈ మేరకు రూ.20 లక్షలు మంజూరు చేసినట్లు వివరించారు. అంతర్గాం, కంగ్టి మండలం బాన్సువాడ(డి) గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్లను ఎమ్మెల్యే ప్రారంభించారు. సర్పంచులు రవీందర్, హనుమంతు, నాయకులు మల్హారి, రాజేందర్ పాటిల్, మనోహర్ పాటిల్, ఆకుల రాములు తదితరులు పాల్గొన్నారు. • ఎమ్మెల్యే సంజీవరెడ్డి ఆదివారం మనూరు మండలం బోరంచలో ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించి మాట్లాడారు. లబ్ధిదారులకు సకాలంలో బిల్లులు చెల్లిస్తున్నట్లు వివరించారు. నాయకులు, అధికారులు, గ్రామస్థులు ఉన్నారు.

కాలనీల్లో అంధకారం.. ఎప్పటికయ్యేను పరిష్కారం?

• పురపాలికల్లో వీధి దీపాలు వెలగక ప్రజల అవస్థ

పరిశీలన


సంగారెడ్డి పట్టణంలో ప్రధాన రహదారిపై ఇలా..

న్యూస్‌టుడే, సంగారెడ్డి మున్సిపాలిటీ, సదాశివపేట, కంది, జహీరాబాద్, నారాయణఖేడ్: జిల్లాలోని పట్టణాలు, గ్రామాల్లో వీధి దీపాల నిర్వహణ అధ్వానంగా మారింది. చాలా చోట్ల కాలనీల్లో స్తంభాలకు ఉన్న వీధి దీపాలు వెలగకున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఆయా ప్రాంతాల్లో చీకట్లు అలుముకుంటున్నాయి. వర్షాకాలంలో రాత్రి పూట ఆయా కాలనీల్లో అంధకారం నెలకొనడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. లైట్లు ఏర్పాటు చేయించాలని అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. వీధి దీపాలు సరిగా లేక, మరి కొన్ని చోట్ల మూడో వైర్ లేకపోవడంతో సరఫరా సమస్య వస్తుందని అధికారులు చెబుతున్నారు.

జిల్లాలో ఇలా..

• సంగారెడ్డిలోని ప్రధాన రహదారి, బైపాస్ రోడ్డులో పూర్తి స్థాయిలో వీధి దీపాలు వెలగడం లేదు. కొత్తగా ఏర్పడిన మైత్రి నగర్, ఓడీఎఫ్ కాలనీ, రాఘవేంద్రనగర్, రెడ్డి కాలనీ, ఆదర్శనగర్ తదితర చోట్ల వీధి దీపాలు పూర్తిగా వెలగడం లేదు. • సదాశివపేట పట్టణంలోని సిద్ధాపూర్, నాగేశ్వరరావునగర్, రాంనగర్, ప్రియదర్శిని స్పిన్నింగ్ మిల్, హనుమాన్ నగర్ తదితర కాలనీల్లో కూడా వెలగడం లేదు. ప్రధాన రహదారిపై కొన్ని చోట్ల వీధి దీపాలు వెలగకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. • కంది, ఎద్దుమైలారం, మామిడిపల్లి, ఇంద్రకరణ్ గ్రామాల్లోని కొన్ని చోట్ల విద్యుత్తు లైట్లు పాడయ్యాయి. అంధకారంతో ప్రయాణికులు ప్రమాదాల బారిన పడుతున్నారు.

ఎలక్ట్రిక్ దీపాలు ఏర్పాటు చేసినా..

• జహీరాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని ఝరాసంగం కమాన్ నుంచి పస్తాపూర్ వైపు కిలో మీటర్ దూరం వరకు బటర్‌ఫ్లై దీపాలు ఏర్పాటు చేశారు. నెల రోజులుగా అవి వెలగకపోవడంతో అంధకారం నెలకొని పరిసర కాలనీలకు వెళ్లే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయంపై అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా ఫలితం లేదని స్థానికులు వాపోతున్నారు. రాత్రి వేళలో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు
• ఆర్టీసీ కాలనీలో చాలా స్తంభాలకు నెలల తరబడి దీపాలు వెలగకపోవడంతో అంధకారం ఏర్పడింది. ఇళ్ల మధ్యలో ఖాళీ స్థలాలు ఉండగా.. పొదలు పెరిగి రాత్రి పూట విషసర్పాలు వస్తున్నాయని ప్రజలు భయపడుతున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

సంగారెడ్డి 8008573233, జహీరాబాద్ 9441648363, నారాయణఖేడ్ 8008573248, నారాయణఖేడ్ టౌన్ 8008573250 | అందోలు 8008573241, జిన్నారం 8008573231 (10AM TO 1 PM)

న్యూస్‌టుడే, సంగారెడ్డి మున్సిపాలిటీ: ? సంగారెడ్డిలోని వివేకానంద నగర్‌లో రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. చిన్నపాటి వర్షానికి రహదారులు బురదమయంగా మారుతున్నాయి. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలి. - జైపాల్, సంగారెడ్డి

✓ వెంటనే సిబ్బందిని పంపి వీధి దీపాలు ఏర్పాటు చేయిస్తాం. - రఘు, పురపాలక డీఈఈ

? సంగారెడ్డిలోని ఇందిరా కాలనీలో మురుగు కాలువలను శుభ్రం చేయకపోవడంతో రోడ్డుపైకి వ్యర్థ జలాలు చేరుతున్నాయి. దుర్వాసనతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి కాలువలను శుభ్రం చేయించాలి. - మధు, సంగారెడ్డి

✓ వెంటనే సిబ్బందిని పంపించి మురుగు కాలువలను శుభ్రం చేయిస్తాం. - సయ్యద్ సాజిద్, పురపాలక పారిశుద్ధ్య పర్యవేక్షకుడు

న్యూస్‌టుడే, నారాయణఖేడ్: ? నారాయణఖేడ్ పట్టణంలోని ఖేడ్-రాయిపల్లి రోడ్డు నుంచి రాంవిలాస్ గల్లీకి వెళ్లే దారిలో కల్వర్టు కింద చెత్త పేరుకుపోవడంతో మురుగు ముందుకు పారడం లేదు. వ్యర్థ జలాలు నిల్వ ఉండటంతో దుర్వాసన వ్యాపిస్తోంది. విపరీతంగా దోమలు ప్రబలుతున్నాయి. - రాములు, ఖేడ్

✓ కల్వర్టు కింద పేరుకుపోయిన చెత్తను తొలగింపజేసి మురుగు నిల్వకుండా అవసరమైన చర్యలు తీసుకుంటాం. - శ్రీనివాస్, పారిశుద్ధ్య పర్యవేక్షకుడు, ఖేడ్ పురపాలిక

జహీరాబాద్, న్యూస్‌టుడే: ? జహీరాబాద్ పట్టణంలోని వేమారెడ్డినగర్ కాలనీలో వీధులు కొద్దిపాటి వర్షానికే బురదమయంగా మారుతున్నాయి. రాకపోకలకు స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. - నర్సింహులు, కాలనీ వాసి

✓ వెంటనే తగిన చర్యలు తీసుకుంటాం. - వెంకటేశ్, ఏఈ, జహీరాబాద్ పురపాలిక

జోరుగా సాగుదాం..!

• వ్యవసాయ పనుల్లో లీనమైన రైతులు, కూలీలు


పత్తి చేనులో అరకతో రైతు

న్యూస్‌టుడే, ఝరాసంగం, జహీరాబాద్, కోహీర్, న్యాల్‌కల్: ఖరీఫ్ సీజన్‌లో పంట పొలాల్లో కలుపుతీత, మందుల పిచికారీ, అరక సాగుతో వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. ఉదయం, మధ్యాహ్నం వేళల్లో రైతులు, కూలీలు పనులు చేస్తున్నారు. కొంత మంది సామూహికంగా ఏర్పడి గుత్తలు తీసుకుని పంట పొలాల్లో కలుపు తీతకు వెళ్తున్నారు. జహీరాబాద్, ఝరాసంగం, న్యాల్‌కల్, కోహీర్, మొగుడంపల్లి మండలాల్లో వర్షాధార పంటలైన పత్తి, మొక్కజొన్న, పెసర, మినుము, కంది, సోయాబీన్, నువ్వులు, కొర్రలను సాగు చేస్తున్నారు.

జిల్లాలో అధికారుల ప్రకారం వివరాలు..

పంట	ఎకరాల్లో
కంది	1,59,070,
పత్తి	3,82,511,
సోయాబీన్	61,312,
మొక్కజొన్న	9,563,
పెసర	8,491,
మినుము	5,792,
ఇతర	1,412

జోడెడ్లకూ గిరాకీ..

ప్రస్తుతం యంత్రాల సహాయంతో వ్యవసాయ పనులు చేస్తున్నప్పటికీ జోడెడ్లకు గిరాకీ తగ్గలేదు. దుక్కులు దున్నడం, విత్తనం, సాళ్ల మధ్య దిండుతో కలుపు మొక్కలు తొలగించడం, ఎడ్ల సహాయంతో పనులు చేయడం వల్ల భూమి గట్టిగా కాదని పలువురు రైతులు తెలిపారు. ట్రాక్టర్‌తో చేసే పనుల వల్ల భూమి గట్టిగా అవుతోందని అంటున్నారు. ఎకరా పొలంలో జోడెద్దులతో పనిచేసేందుకు రూ.1200 తీసుకుంటున్నారు.

తెగుళ్ల నివారణకు పిచికారీ

ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలకు పిచికారీ చేసేందుకు ఎకరాకు రూ.1000 తీసుకుంటున్నారు. కూలీలు అందుబాటులో లేక ఇతర గ్రామాల నుంచి రప్పించి వ్యవసాయ పనులు చేయిస్తున్నారు. మరికొంత మంది రైతులు ట్రాక్టర్ సహాయంతో పంటలకు పిచికారీ చేస్తుండగా మొక్కల కొమ్మలు విరిగిపోయి నష్టం జరుగుతోంది.

సేంద్రియ పద్ధతులే మేలు

ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో పంటలు ఆశాజనకంగా ఉన్నాయి. మోతాదుకు మించి మందులు పిచికారీ చేయొద్దు. సేంద్రియ పద్ధతుల్లో పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం.
- వెంకటేశం, ఏవో, ఝరాసంగం

బిల్లులు అందక నిలిచిన.. 'భవిత కేంద్రాలు'


కల్హేర్‌లో భవన నిర్మాణం ఇలా..

న్యూస్‌టుడే, కల్హేర్, నారాయణఖేడ్: ప్రత్యేక అవసరాల పిల్లలకు విద్యను అందించేందుకు మండల కేంద్రాల్లో నిర్మిస్తున్న భవిత కేంద్రాల భవనాలు అసంపూర్తిగా కనిపిస్తున్నాయి. బిల్లులు అందకపోవడంతో గుత్తేదార్లు పనులను నిలిపేశారు. నారాయణఖేడ్ డివిజన్ పరిధిలోని కల్హేర్, సిర్గాపూర్, తడ్కల్, మనూరు మండలాలకు సర్వశిక్షా అభియాన్ కింద భవిత కేంద్రాల నిర్మాణాలకు 2025లో ప్రభుత్వం ఒక్కో భవనానికి రూ.9.50 లక్షలు మంజూరు చేసింది. ఈ విద్యా సంవత్సరంలో ఆయా భవనాల నిర్మాణాలకు గుత్తేదార్లు పనులు ప్రారంభించారు. స్లాబుల వరకు నిర్మించి బిల్లులు అందక పోవడంతో ఆపేశారు.

గదులు లేక ఇబ్బందులు..

మండలాల్లో ప్రత్యేక అవసరాల పిల్లలకు ప్రస్తుతం తరగతులకు గదులు లేక ఇబ్బందులు పడుతున్నారు. ఐఆర్‌టీ శిక్షణలకు పిల్లలు ఉన్నా గదుల కొరత నెలకొంది. అధికారులు స్పందించి భవన నిర్మాణాలు పూర్తయ్యేలా చూడాలని కోరుతున్నారు.

ఉన్నతాధికారులకు నివేదించాం

గుత్తేదార్లకు బిల్లులు రాలేదు. ఈ మేరకు రికార్డులు చేసి జిల్లా కార్యాలయంలో నివేదించాం. నిర్మాణ ఖర్చులపై ఉన్నతాధికారులకు వివరించాం. - **మాణయ్య, ఏఈ, ఖేడ్ డివిజన్ సర్వశిక్షా అభియాన్**

నేడు పురపాలక సంఘం సమావేశం

సదాశివపేట, సదాశివపేట రూరల్, న్యూస్‌టుడే: పురపాలక సంఘం సాధారణ సమావేశం సోమవారం ఉదయం 11.30 గంటలకు ఉంటుందని అధ్యక్షురాలు మునిపల్లి అంజమ్మ తెలిపారు. సభ్యులు, అధికారులు సకాలంలో హజరు కావాలని ఆమె కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

హత్నూర, న్యూస్‌టుడే: హత్నూర మండల పరిధిలోని గుండ్లమాచునూర్ ఆదర్శ పాఠశాలకు అనుసంధానంగా కొనసాగుతున్న బాలికల వసతి గృహంలో తాత్కాలిక పద్ధతిన పనిచేయడానికి చౌకీదారు పోస్ట్ కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు నిర్వాహకురాలు మమత ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏడో తరగతి చదివిన మహిళలు దరఖాస్తు చేసుకోవాలని ఆమె చెప్పారు.

జిల్లాలో చిరు జల్లులు

సంగారెడ్డి అర్బన్, న్యూస్‌టుడే: జిల్లావ్యాప్తంగా ఆదివారం వాతావరణం చల్లబడింది. పలు ప్రాంతాల్లో చిరుజల్లులు కురిశాయి. రోడ్లు, కాలనీలు చిత్తడిగా మారాయి. ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

వీరభద్రస్వామి దేవాలయంలో సామూహిక వ్రతం



బొంతపల్లి (గుమ్మడిదల), ఝరాసంగం, న్యూస్‌టుడే: శ్రావణ మాసం ఆదివారం సెలవు కావడంతో బొంతపల్లి వీరభద్రస్వామి దేవాలయం భక్తులతో కిటకిటలాడింది. సామూహిక అభిషేకాలు, సత్యనారాయణ స్వామి వ్రతాలు, కుంకుమార్చనలు నిర్వహించారు. ఈవో రామ బ్రహ్మచారి, సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు. • శ్రావణమాసం సందర్భంగా ఆదివారం ఝరాసంగం మండలం ఈదులపల్లి రేవణ సిద్దేశ్వరుడు, గుబ్బడి సంగమేశ్వరుడు, కొల్లూర్, మాచునూర్ రామేశ్వరాలయాలు, మల్లన్నగుట్ట, పొట్‌పల్లి సిద్దేశ్వరుడికి భక్తులు రుద్రాభిషేకాలు, అర్చనలు, బిల్వార్చనలు నిర్వహించారు.

గుంతలు తవ్వారు.. మొక్కలు మరిచారు



మండల కేంద్రమైన నాగల్‌గిద్ద ఎంపీడీవో కార్యాలయం నుంచి గ్రామం వరకు సీసీ రోడ్డు మధ్యలో మొక్కలు నాటడం కోసం గుంతలు తవ్వి వదిలేశారు. నెలలు గడుస్తున్నా మొక్కలు నాటడంలేదు. వన మహోత్సవం కార్యక్రమం జోరుగా సాగుతున్నా.. ఇక్కడ మాత్రం అధికారులు పట్టించుకోవడంలేదు. గుంతల వల్ల ప్రమాదాలు పొంచి ఉన్నాయని స్థానికులు మండిపడుతున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. - **న్యూస్‌టుడే, మనూరు**

హజ్రత్ ఉర్సు.. నాయకుల ప్రార్థనలు


దర్గాలో మాజీ మంత్రి చంద్రశేఖర్, నాయకులు

జహీరాబాద్ అర్బన్, న్యూస్‌టుడే: జహీరాబాద్ మండలం శేఖాపూర్‌లోని హజ్రత్ షేఖ్ షాబుద్దీన్ తుర్కీ దర్గా ఉర్సులో మాజీ మంత్రి, జహీరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి డా.చంద్రశేఖర్ పాల్గొన్నారు. పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు ఎంజీ రాములు, నరేష్‌గౌడ్, సర్పంచి, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు చష్మొద్దీన్, నాయకులు తదితరులు ఉన్నారు.

రహదారి కూడలి.. వాహనదారులు హడలి!



సంగారెడ్డి-ముంబయి రహదారిపై నిత్యం లక్షలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు. సదాశివపేట పట్టణ శివారులోని కూడలి వద్ద వాహనాలు అడ్డదిడ్డంగా వెళ్తున్నాయి. ఇక్కడ పట్టణంలోకి వెళ్లే వాహనాలు, జాతీయ రహదారి బైపాస్ మీదుగా వెళ్లే చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. ఇక్కడ ఎటువంటి ప్రమాద హెచ్చరిక బోర్డులు, సూచికలు లేవు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. - న్యూస్‌టుడే, సంగారెడ్డి అర్బన్

అంగన్‌వాడీ లేదు.. పాఠశాల కానరాదు!

గడ్డపోతారం పుర పరిధి జీఎంఆర్ 181 కాలనీలో దుస్థితి


అంగన్‌వాడీ చిన్నారులతో మాట్లాడుతున్న అప్పటి కలెక్టర్

న్యూస్‌టుడే, జిన్నారం: అక్కడ 1500 కుటుంబాలు, ఐదో తరగతి వరకు వెళ్లే విద్యార్థులే 100కు పైగా ఉంటారు. ఇక అంగన్‌వాడీకి అర్హత ఉన్న వారు 50 మందికి పైనే.. నిత్యం ఆహారం తీసుకునే బాలింతలు, గర్భిణులు 80 మంది వరకు ఉంటారు. ఇది అధికారిక లెక్కలు. గతంలో సమస్యను గుర్తించిన జిల్లా కలెక్టర్, డీఈవో, స్త్రీ శిశు సంక్షేమాధికారిణి, ఇతర అధికారులు కాలనీకి వచ్చి అంగన్‌వాడీతో పాటు ప్రాథమిక పాఠశాల ఏర్పాటు చేస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు. ఆ తరువాత అనేక పర్యాయాలు అధికారులు కాలనీలో తిరిగారు. తరువాత విషయం మరిచిపోయారు. ఇదీ జిన్నారం మండలం గడ్డపోతారం పురపాలిక పరిధిలోని జీఎంఆర్ 181 కాలనీ దుస్థితి.

అంతా నిరుపేదలే..

కాలనీలో 90 శాతం మంది నిరుపేదలు. పొట్ట చేతపట్టుకొని వచ్చిన వలస కుటుంబాలే. అందుబాటులో అంగన్‌వాడీ, ప్రాథమిక పాఠశాల లేక చదువులకు దూరం అవుతున్నారు. చాలా మందికి పోషకాహారం అందడం లేదు. కొందరు బాల కార్మికులుగా మారుతున్నారు. 2024 సెప్టెంబరు 4న కాలనీకి వచ్చిన అప్పటి కలెక్టర్ వెంటనే పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఆదేశించారు. విద్యా సంవత్సరం నష్టపోకుండా తాత్కాలిక అద్దె భవనంలో నిర్వహించాలని సూచించారు. ఇదే సమయంలో అంగన్‌వాడీ భవనం, పాఠశాల నిర్మాణానికి స్థలం కేటాయించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఇప్పటికీ కాలనీలో ఉన్న స్థలాలు ఆక్రమణకు గురవుతున్నా.. పాఠశాలలకు కేటాయించడం లేదు. 3 వేలకు పైగా జనాభా ఉన్న ఈ కాలనీ పట్ల యంత్రాంగం పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తోంది. కలెక్టర్ ఆదేశాల తరువాత కొన్ని రోజులు అంగన్‌వాడీ నిర్వహణకు భోజనం పంపించి తరువాత మరిచిపోయారు.

స్థలం, భవనం లేకపోవడంతో

కాలనీలో పాఠశాల నిర్వహణకు చిన్నారులు ఉన్నారని గుర్తించాం. స్థలం కేటాయింపు, తాత్కాలిక భవనం ఏర్పాటు చేయలేదు. ఫలితంగా అప్పట్లో జరిగిన ప్రయత్నాలు ఆగిపోయాయి. పాఠశాల ఏర్పాటుపై ఉన్నతాధికారులతో మాట్లాడతాం.
- విజయ్‌కుమార్, ఎంఈవో, జిన్నారం

ప్రతిపాదనలు పంపాం

జీఎంఆర్ 181 కాలనీలో అంగన్‌వాడీ కేంద్రం నిర్వహణకు ప్రతిపాదనలు పంపాం. తాత్కాలికంగా ఏర్పాటుకు గతంలో ఒక టీచర్, ఆయాతో పాటు గదిని ఇవ్వాలని స్థానికులను కోరాం. ఎవరూ ముందుకు రాలేదు. - **మీరాబాయి, అంగన్‌వాడీ కేంద్రాల మండల పర్యవేక్షకురాలు**

తీసుకొచ్చారు.. పక్కనపెట్టారు..



మనూరు మండలం ఎల్గోయిలో విద్యుత్తు నియంత్రిక కొన్ని సంవత్సరాల నుంచి వృథాగా ఉంది. లోవోల్టేజీ సమస్య తీర్చడం కోసం తీసుకొచ్చి.. బిగించకుండా రోడ్డు పక్కన వదిలేశారు. అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదు. ఉన్నతాధికారులు స్పందించి నియంత్రికను బిగించేలా చర్యలు తీసుకోవాలని స్థానిక రైతులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, మనూరు

శ్రీసద్గురు దీక్షితుల పుట్టినరోజు వేడుకలు

కోహీర్, న్యూస్‌టుడే: పట్టణంలోని యాగశాలలో ఆయుర్వేద విద్వాన్, వేద ధర్మ ప్రవచన కర్త శ్రీసద్గురు దక్షిణామూర్తి దీక్షితుల జన్మదిన వేడుకలు ఆదివారం నిర్వహించారు. భక్తులు ఆయనకు పూలమాలలు వేసి శాలువాలతో సన్మానించారు. తీర్థ ప్రసాదాలు అందజేసి అన్నదానం చేశారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం


ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

జిన్నారం, న్యూస్‌టుడే: మండల కేంద్రమైన జిన్నారంలో ఆదివారం పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి పాల్గొని ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. మాజీ జడ్పీటీసీ కె.బాల్‌రెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ జనార్దన్, ఉపాధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి, నాయకులు వెంకటేశంగౌడ్, శ్రీనివాస్‌రెడ్డి భక్తులు పాల్గొన్నారు.

వాహనాలు ఢీ.. స్తంభాలు విరిగిపడి..


ఐడీఏ బొల్లారం పారిశ్రామికవాడలో స్తంభాలు ఇలా

జిన్నారం, న్యూస్‌టుడే: రెండు వాహనాలు ఢీకొనడంతో విద్యుత్తు స్తంభాలు కిందపడిపోయిన ఘటన ఐడీఏ బొల్లారం పారిశ్రామిక వాడలో ఆదివారం ఉదయం చోటు చేసుకుంది. ఆ సమయంలో కార్మికులు ఎవరూ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. స్థానికులు తెలిపిన వివరాలు.. పారిశ్రామిక వాడలోని పిఫా పరిశ్రమ వద్ద ఎదురెదురుగా టిప్పర్లు వేగంగా రావడంతో తప్పించబోయి స్తంభాలను ఢీ కొట్టాయి. రెండు స్తంభాలు విరిగిపడ్డాయి. వెంటనే విద్యుత్తు సరఫరాను నిలిపివేశారు. పరిశ్రమల్లో ఉత్పత్తులు నిలిచిపోయాయి. స్పందించిన అధికారులు నివారణ చర్యలు చేపట్టి విద్యుత్తు సరఫరాను పునరుద్ధరించారు.

సోదరికి కానుకగా 'రక్త'బంధ కంకణం


రక్తంతో తయారు చేసిన గాజులు

జోగిపేట టౌన్, న్యూస్‌టుడే: సోదరిపై తనకున్న అపరిమితమైన ప్రేమను చాటుకోవడానికి ఓ యువకుడు చేసిన రక్త త్యాగం ఆ అనుబంధానికి నిలువెత్తు రూపంగా నిలిచింది. సంగారెడ్డి జిల్లా అందోలు గ్రామానికి చెందిన జల్ల అశ్విని కూకట్‌పల్లిలో ఉంటున్న తన తమ్ముడు వంశీకుమార్‌కు రాఖీ కట్టేందుకు వెళ్లింది. ఈ మేరకు సోదరుడు ఎర్రని రక్త వర్ణం కంకణాలు(గాజులు) ఆమె చేతికి అందించడంతో ఆశ్చర్యానికి గురైంది. అక్క ముఖంలో చిరునవ్వు చూడటం కోసం తన శరీరంలోని 10మి.లీటర్ల రక్తంతో ప్రత్యేకంగా రూ.3,600 ఖర్చుతో రెండు గాజులు తయారు చేయించినట్లు యువకుడు తెలిపాడు.

తెలుగు ఉపాధ్యాయుడికి ప్రశంస

జిన్నారం, న్యూస్‌టుడే: గిడుగు రామ్మూర్తి జయంతి సందర్భంగా హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన కవి సమ్మేళనంలో జిన్నారం మండలం కొడకంచి జడ్పీ పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు మొగలిమాల ప్రతిభ చూపి ప్రశంసా పత్రం అందుకున్నారు. గిడుగు రామ్మూర్తి ముని మనవరాలు క్రాంతికృష్ణ, నవ్యాంధ్ర రచయితల సంఘం అధ్యక్షుడు బిక్కి కృష్ణ చేతుల మీదుగా పురస్కారం అందుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

మురుగుతో అపరిశుభ్రం.. అనారోగ్యం..



గుమ్మడిదల పురపాలిక పరిధి బొంతపల్లి వార్డులోని భగత్ సింగ్ విగ్రహం దగ్గర మినీ ట్యాంకు ఏర్పాటు చేశారు. ఇక్కడ నీరు వెళ్లేందుకు కాలువ ఏర్పాటు చేయలేదు. నీరు వృథాగా పోతోంది. మురుగు కాలువ ఏర్పడింది. నీళ్ల కోసం వచ్చేవారు దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నారు. - న్యూస్‌టుడే, బొంతపల్లి(గుమ్మడిదల)

విద్యార్థుల ప్రతిభ.. బహుమతుల అందజేత


విద్యార్థులతో పాఠశాల నిర్వాహకులు

జిన్నారం, న్యూస్‌టుడే: క్రీడల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ఐడీఏ బొల్లారం పట్టణంలోని జాయ్ ఇంటర్‌నేషనల్ స్కూల్ నిర్వాహకులు బహుమతులు అందించారు. ఇటీవల వారికి క్రీడాపోటీలు నిర్వహించారు. వివిధ రకాల క్రీడల్లో ప్రతిభ చాటిన పలువురు విద్యార్థులకు ఈ ఏడాదికి సంబంధించిన ఫీజు రీఫండ్ చేశారు. పాఠశాల ఛైర్మన్ ప్రసాద్‌రెడ్డి, డైరెక్టర్ సతీష్‌కుమార్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులున్నారు.

రోడ్డు గుంతలమయం.. ఇబ్బందులు అనేకం



ఖేడ్ మండలం అంత్వార్-అనంతసాగర్ గ్రామాల మధ్య 3 కి.మీ.ల మేర బీటీరోడ్డు గోతులమయమైంది. అయిదేళ్లుగా ఈ రోడ్డుపై అడుగుకో గుంత ఉండగా.. ప్రస్తుత వర్షాకాలంలో గోతులు భారీగా పెరిగాయి. ఈ మార్గం ద్వారా దాదాపు 10 గ్రామాలు, తండాలకు రాకపోకలు సాగిస్తుంటారు. గుంతల వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని ఆయా గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. - న్యూస్‌టుడే, నారాయణఖేడ్

ప్రధాన దారి.. ప్రమాదకరంగా మారి!



జహీరాబాద్ పట్టణం నుంచి సిద్దేశ్వర ఆలయం, రహమత్‌నగర్‌ల మీదుగా జహీరాబాద్, ఝరాసంగం, న్యాల్‌కల్ మండలాల్లోని వివిధ గ్రామాలను కలిపే ప్రధాన రహదారి అధ్వానంగా మారింది. రోడ్డుపై తారు, కంకర లేచి పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. ద్విచక్రవాహనదారులు పడిపోయే అవకాశం ఉంది. ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. - **న్యూస్‌టుడే, జహీరాబాద్**

డీసీఎం చోరీ.. నిందితుడి అరెస్టు

సదాశివపేట, సదాశివపేట రూరల్, న్యూస్‌టుడే: పట్టణంలో డీసీఎం వ్యాన్ చోరీకి పాల్పడిన దొంగను అరెస్టు చేసినట్లు సదాశివపేట సీఐ వెంకటేశ్‌గౌడ్ తెలిపారు. ఆయన చెప్పిన వివరాలు.. నారాయణఖేడ్ మండలం సతే గ్రామానికి చెందిన మంగలి గోపాల్ కుటుంబ కలహాలతో దూరంగా ఉంటూ.. మద్యానికి బానిసయ్యాడు. డబ్బు కోసం వాహనాల చోరీలకు పాల్పడుతున్నాడు. ఈనెల 27న పట్టణంలోని ఓ హోటల్ సమీపంలో పార్కు చేసిన డీసీఎం వ్యాన్‌ను ఎత్తుకెళ్లాడు. వాహనం యజమాని ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సీసీ కెమెరాల ఆధారంగా నిందితుడిని గుర్తించి ఆదివారం అరెస్టు చేసి రూ.12 లక్షల విలువైన వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ వివరించారు.

ఏ తీగ.. ఏ ఇంటిదో..



ఖేడ్ పురపాలక సంఘం పరిధిలోని ఓ కాలనీలో విద్యుత్తు స్తంభానికి భారీగా కనెక్షన్లు ఉండటంతో పాటు ఇళ్లకు ఇంటర్‌నెట్, కేబుల్ టీవీ కనెక్షన్లకు సంబంధించిన తీగలు ఉన్నాయి. ఇటీవల తీగలు కాలిపోయి సమస్య వస్తే సంబంధిత ఇంటి కనెక్షన్ ఏదో తెలియని పరిస్థితి నెలకొంది. మరమ్మతులు చేయడానికి విద్యుత్తు విభాగం సిబ్బందికి అవస్థలు తప్పడం లేదు. - న్యూస్‌టుడే, నారాయణఖేడ్

ఖేడ్-సిద్దిపేట బస్సును పునరుద్ధరించాలి

నారాయణఖేడ్, నారాయణఖేడ్ రూరల్, న్యూస్‌టుడే: ఖేడ్ ఆర్టీసీ డిపో నుంచి నడిపించే ఖేడ్-సిద్దిపేట బస్సును పునరుద్ధరించాలని ఈ ప్రాంతవాసులు కోరుతున్నారు. ఖేడ్ నియోజకవర్గానికి చెందిన అనేక మంది విద్యార్థులు మెదక్, సిద్దిపేట ప్రాంతాల్లోని గురుకులాలు, ఇతర విద్యాసంస్థల్లో చదువుకుంటున్నారు. ఆయా ప్రాంతాల వారు ఉద్యోగాలు చేస్తున్నారు. వారి సౌకర్యార్థం 20 ఏళ్ల కిందట ఖేడ్ డిపోనకు సంబంధించిన బస్సును ఖేడ్ నుంచి మెదక్ మీదుగా సిద్దిపేటకు ప్రారంభించారు. నెల కిందట ఈ బస్సును వరంగల్ వరకు పొడిగించి సమయాన్ని మార్చారు. విద్యార్థులు, ఉద్యోగులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు.

మహిళ అదృశ్యం.. కేసు నమోదు

హత్నూర, న్యూస్‌టుడే: మండల పరిధి నాగులదేవులపల్లి గ్రామానికి చెందిన ఓ మహిళ(47) అదృశ్యమైనట్లు ఎస్సై శ్రీధర్ రెడ్డి తెలిపారు. ఆమె తల్లిదండ్రులు గొడవపడగా మనస్తాపానికి గురైన ఆమె ఈనెల 26న ఇంట్లో నుంచి వెళ్లి తిరిగి రాలేదని చెప్పారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన వివరించారు.